కథ

# రంగు రాళ్ళు

ఆమె ప్రాణం కొండెగట్టిన దీపంలా ఉంది. గాలిలో దీపంలా చావుబతుకుల మధ్య ఊగిసలాడుతోంది సుందరమ్మ. డెబ్బయ్యేళ్ళ శరీరాన్ని అంటిపెట్టుకున్న ప్రాణం బయటికి పోడానికి విశ్వప్రయత్నం చేస్తోంది. నాలుగు రోజులుగా అదే పరిస్థితి.

డాక్టరు వచ్చాడు. నాడి చూసి పెదవి విరిచాడు.

''ప్ఛ్...ఆఖరి దశ. దగ్గిర వాళ్ళందరికీ టెలిగ్రాంలిచ్చి రప్పించుకోండి'' అన్నాడు.

జీవితపు రహదారిలో ఎన్నో ముళ్ళకంపల్ని దాటుకుంటూ బతుకుబండి లాగించిన సుందరమ్మ జీవితం చివరి ఘడియల్లోకి వచ్చింది. ఆటుపోట్లని తట్టుకున్న అనుభవమేమో...మృత్యువుతో కూడా పోరాడుతోంది ఓటమి ఖాయమని తెలిసినా!

''అయ్యో...ఇంట్లో పోతుందేమో వరండాలో పడుకోబెట్టండి'' అన్నారెవరో.

'నా' అన్న ఇల్లు ఉండాలన్న పట్టుదలే సుందరమ్మకి లేకపోతే అసలా ఇల్లే ఉండేది కాదేమో! తిండి, బట్ట, ఇల్లు ఏ మనిషికైనా కావాల్సిన కనీసావసరాలని మొదటి రెండిటికీ ఫరవాలేకపోయినా ఆ మూడోదే గగన కుసుమం సుందరమ్మ లాంటి మధ్యతరగతి వాళ్ళకి.

సుందరమ్మ భర్త ఓ గవర్నమెంటు ఆఫీసులో గుమాస్తా. చాకిరీ ఎక్కువ, జీతం తక్కువ. ఆ తక్కువ జీతంతోనే తన ముగ్గురు పిల్లలతో పాటు ముసలి తల్లిదండ్రులని చూసే బాధ్యత కూడా అతనిదే.

ప్రసాదరావుకి సంపాదించడం తెలుసు కాని, ఆ సంపాదనని అవసరాల కనుగుణంగా సర్దడం తెలీదు.

ఓర్పుకి, సహనానికి మారుపేరైన సుందరమ్మ ఆర్థిక శాస్త్రం చదువుకోకపోయినా ఉన్నదాంతోనే గుట్టుగా సంసారాన్ని నడుపుకొచ్చేది.

పెళ్ళిలో పుట్టింటివాళ్ళు పెట్టిన గొలుసు, గాజులు, దుద్దులు తప్పితే పెళ్ళయి పదేళ్ళయినా వీసమెత్తు బంగారమైనా కొనలేని భర్త అసమర్థతని ఏనాడూ వేలెత్తి చూపని మహా ఇల్లాలు సుందరమ్మ.

అందుకే ప్రసాదరావుకి భార్యంటే అమితమైన ప్రేమ, గౌరవం కూడా. అలాటి సుందరమ్మకి కూడా సొంత గూడు ఉంటే బాగుండనిపించింది. ఆమె భర్తకు కూడా ఆమె కోరిక సమంజసమే అనిపించింది. అందుకే హౌసింగ్ లోన్ తీసుకొని చిన్న ఇల్లు కట్టించాడు.

ఆ యింటితో సుందరమ్మకున్న అనుబంధం మాటల్లో చెప్పలేనిది. ఎదిగే బిడ్డ మాటలు నేర్చి, నడక నేర్చి, ఆపై చదువునేర్చి ప్రయోజకుడైన వ్యక్తిగా ఎదిగినపుడు తల్లి పొందే సంతోషం ఎలాటిదో ఆ యింటికి పునాదులు వేసినపుడూ, వాటి గోడలు కట్టినపుడూ, కిటికీలు, తలుపులు బిగించినపుడూ తన కలల ప్రతిరూపమైన ఆ యింటిని చూసి అలాగే సంబరపడింది సుందరమ్మ.

> చూడండమ్మా మనుషులు బతకడానికి డబ్బు కావాలి కానీ, డబ్బుకోసమే మనుషులు బతకకూడదు తల్లీ. జబ్బు చేస్తే తగ్గడానికి మందులేసుకుంటాం, అలాగని మందులొక్కటే తిని బతకలేంగా. డబ్బంటే అవసరాలనే జబ్బులకి మందులా పని చెయ్యాలి కానీ, డబ్బొక్కటే మనకి ముఖ్యమనుకుంటే ఈ ప్రపంచంలో ఇక ఏ బంధాలూ మిగలవు తల్లీ.

అలాటిది ఆమెపోతే ఇల్లు పాడుపెట్టాల్సొస్తుందని ఆవిడని వరండాలో చాపమీద పడుకోబెట్టాడు ఆమె కొడుకు ప్రదీప్.

అం డి భయం అతడిది.

ఉచ్ఛ్వాస, నిశ్వాసాలకి కూడా కష్టపడుతోంది సుందరమ్మ. ఘనపదార్థాలేవీ లోపలికి పోవట్లేదు. అప్పుడప్పుడూ స్పూన్‌తో హార్లిక్స్ నోట్లో పోస్తోంది కోడలు సుజాత.

చేతనావస్థలోని సుందరమ్మ శరీరాన్ని అచేతనావస్థలోనికి మార్చే ప్రయత్నంలో క్షణాలు గడిచిపోతున్నాయి భారంగా. ఇల్లంతా గంభీర వాతావరణం అలుముకుంది.

''ఎలా వుంది మీ అత్తగారి పరిస్థితి'' పక్కింటి మాలతి పెరటి గోడ అవతల నుంచి అడిగింది సుజాతని.

''అలాగే వుంది. గుటక కూడా వెయ్యలేకపోతోంది. ఆవిడ అవస్థ ఏమోగాని నే ఛస్తున్నాను'' విసుగ్గా అంది సుజాత.

''ఏం చేస్తాం సుజాతా...కాళ్ళు, చేతులు పనిచేయక పోయినా వీళ్ళకి ఆయుర్దాయమిస్తాడు దేవుడు, నిక్షేపంలా సంసారం చేసుకునే వాళ్ళని మాత్రం అర్థాంతరంగా తీసుకుపోతాడు'' రోడ్డు యాక్సిడెంట్‌లో చనిపోయిన తమ్ముడు గుర్తుకు రాగా అంది మాలతి.

''అక్కా, మీరేమనుకోనంటే ఒక మాట'' తటపటాయిస్తూనే అంది సుజాత.

''అయ్యో, నా దగ్గిర మొహమాటవేంటి అడుగు'' అంది మాలతి.

''అదీ..అదీ..మరి ఆవిడ పోతే ఇంట్లో బట్టలన్నీ తడపాలిగా''

''తడపద్దూ మరి...ఆచారాలు ఒదులుకుంటామా''


''అందుకే ఓ చిన్న సాయం చేయాలక్కా మీరు..నావి ఈ మధ్యనే కొన్న పట్టు చీరలున్నాయి. వేలకి వేలు పోసి కొన్న ప్యూర్ జరీ చీరలు. తడపాలంటే మనసొప్పట్లేదు. ఆవిడ పోయిన టైంలో ఆ చీరలు ఇంకోరింట్లో ఉంటే తడపక్కర్లేదుట, అందుకని కాస్త మీయింట్లో దాస్తావేమోనని. శుద్ధి కార్యక్రమాలయ్యాక తీసుకుంటాను''

''అంతే కదా, ఈ మాత్రం దానికి అంత మొహమాట పడతావెందుకు? ఇరుగు పొరుగన్నాక ఆ మాత్రం సాయం చేసుకోకపోతే ఎలా? నీ చీరలన్నీ భద్రంగా చూసే పూచీ నాది'' భరోసా ఇచ్చింది మాలతి.

ఒక మనిషి పోతాడనుకున్నాక వచ్చే ఇబ్బందుల్ని ముందుగానే ఊహించి తీసుకునే జాగ్రత్తకాబోలు.

చుట్టుపక్కల వాళ్ళు ఒకొక్కరూ వచ్చి చూసిపోతున్నారు. ఆవిడ గురించి తెలిసిన వాళ్ళు సుందరమ్మ మంచితనాన్ని జ్ఞాపకం చేసుకుని ఆవిడ ప్రస్తుత పరిస్థితికి జాలిపడుతున్నారు.

ఇవేవీ పట్టని సుందరమ్మ కళ్ళుమూసుకుని పడుకుంది. ఉండుండి వచ్చే దగ్గుతెర ఆమెను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. కంటిచూపు మందగించడంతో ఎవరినీ గుర్తుపట్టలేక పోతోంది.



క్షణక్షణానికీ మారుతున్న ఆమె పరిస్థితి కొందరికి ఆందోళన కలిగిస్తే, మరికొందరికి అసహనం, చిరాకు కలిగిస్తోంది.

''ఏమండీ ఓసారిలా రండి'' భర్తని లోపలికి పిలిచింది సుజాత.

''డైనింగ్ టేబుల్‌మీద అన్నీ పెట్టాను. వెళ్ళి కాస్త ఎంగిలి పడి రండి'' లోపలికొచ్చిన భర్తతో అంది.

''ఔతల అమ్మ పరిస్థితి చావుగా నేనిక్కడ భోంచేస్తూంటే చూసే వాళ్ళకి బాగుండదు'' సందేహిస్తూ అన్నాడు ప్రదీప్.

''అలా అనుకుంటే ఇక ఏపనీ చెయ్యలేం, అయినా తినకుండా ఎంతసేపు కూర్చుంటారు? ఆవిడ దగ్గిర నేనుంటా కానీ, మీరు త్వరగా నాలుగు ముద్దలు తినేసిరండి'' అనేసి వెళ్ళిపోయింది సుజాత.

ఎవరి తాపత్రయం వారిది.

సుజాతకి చాలా అసహనంగా ఉంది. నాలుగు రోజులుగా కంటిమీద కునుకు లేదు. తను, భర్త ప్రదీప్ వంతుల వారీగా సుందరమ్మని కనిపెట్టుకొని ఉన్నారు.

మనసంతా ఓ రకమైన టెన్షన్, అనీజీనెస్.

మరణానికి చేరువగానున్న మనిషిని ఎదురుగా ఉంచుకొని దైనందిన కార్యక్రమాలు చేసుకోడంలో ఉన్న ఇబ్బంది లాటిదే అది.

సుందరమ్మ ఇద్దరు కూతుళ్ళూ మైథిలి, కరుణ దగ్గిర ఊళ్ళలోనే ఉంటారు కనుక టెలిగ్రాం అందగానే వచ్చేశారు.

సుందరమ్మ కూతుళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళయి పాతికేళ్ళు దాటుతోంది. పెళ్ళయి అత్తవారింటి కెళ్ళాక ఎవరికైనా తమదంటూ సంసారమనే ఓ సర్కిల్ ఏర్పడుతుంది. అప్పటి వరకూ తల్లిదండ్రుల మీద పెంచుకున్న ప్రేమ స్థానాన్ని, భర్త, పిల్లలూ ఆక్రమిస్తారు. ఈ పరిణామ క్రమంలో కొంతవరకూ తల్లిదండ్రుల మీద ప్రేమ తగ్గుతుందనేది కాదనలేని వాస్తవం.

తల్లి పరిస్థితి తెలిసిన దగ్గర నుండీ ఆవిడ బంగారం, తల్లి పేర కట్టించిన ఇల్లూ మనసులో మెదిలాయి వారికి. అందులో తమ వాటా ఎంత రావాలో కూడా లెక్క వేసుకుంటున్నారు.

అందుకే టెలిగ్రాం అందగానే రెక్కలు కట్టుకు వాలారు.

ఎముకల గూడులా మారిన సుందరమ్మ, చాప కంటుకుపోయి పడుకుంది. ఆవిడ మెడలోను, చేతులకి ఉండాల్సిన గొలుసు, గాజులు లేక బోసిగా వున్నాయి.

గుండె గుభేలు మంది కూతుళ్ళిద్దరికీ. బహుశ వదినే తీసి దాచేసి ఉంటుంది అనుకున్నారు.

సుందరమ్మ మాత్రం నిస్తేజమైన చూపుల్తో కూతుళ్ళు నిద్దర్లో చూసిందొకసారి. ఆనవాలు పట్టిందో మరి లేదో... చివరి శ్వాస విడిచింది.

బావురుమన్నారు కూతుళ్ళిద్దరూ. తల్లి పోయిందనే బాధకన్నా ఇప్పుడా బంగారం ఎలా దక్కించుకోవాలా అన్న దిగులే ఎక్కువైంది వాళ్ళకి.

ఆవిడ పోయిందని డాక్టరు కన్‌ఫర్మ్ చేశాక నాలుగు రోజులుగా వేధిస్తున్న అనీజీనెస్ పోయి రిలీఫ్‌గా నిట్టూర్చింది సుజాత.

నెలవారీ ఖర్చుల్లోంచి డాక్టరు బిల్లు మైనస్ చేసి చూసుకున్నాడు ప్రదీప్.

అసలు మనుషులింత మెటీరియలిస్టిక్‌గా మారడానికి కారణమేంటి? మారుతున్న కాలమా? పెరిగే అవసరాలా? అసలు మనిషికీ మనిషికీ మధ్య ఉండాల్సిన సున్నితమైన బంధాలని తెంపుకొని తమవరకే గిరి గీసుకొని మనుషులెందుకు బతుకుతున్నారు? నేను, నాది అన్న స్వార్థం ఓ స్థాయిని మించి పెరిగితే ఈ సమాజం ఎంత వికృతంగా మారుతుంది.

''ఊర్కో వదినా... ఆవిడ ఆయుష్షు తీరిపోయింది వెళ్ళిపోయింది. అయినా బతికున్నంత కాలమే బంధాలు కానీ పోయాక ఎవరికెవరు?''

వేదాంత ధోరణిలో ఆడపడుచుల్ని ఓదార్చింది సుజాత.

ఔను మరి. వేదాంతం వల్లించే వారికే తాపత్రయాలెక్కువ!

''చూడు బాబూ ఇలా బాధపడుతూ

## ఆదుర్తి బాల

కూర్చుంటే ఎలా? తరువాత జరగాల్సిన కార్యక్రమాలు చూడాలి మరి'' అన్నాడో పెద్దమనిషి.

ఆ మాట కోసమే ఎదురు చూస్తున్న ప్రదీప్ ఆఖరుసారిగా ఏడ్చాడు తన బాధ్యత తీరిపోయిందన్నట్టు.

పిల్లలు ఆకలికి ఉండరు. శవాన్ని తీసుకెళ్ళాక ఇళ్ళు కడిగించడం, బట్టలు తడిపించటం, ఆపైన వంటలు...బోల్డు పనులు. చేయాల్సిన పనుల లిస్టు చదూకుంది సుజాత.

ఇది యాంత్రిక యుగం. పనికిరాని వస్తువులను బైట పడేసినట్టే, కట్టెలా మారిన మనిషిని కట్టెలతో కాల్చేవరకూ అందరే. ఏ పనైనా డ్యూటీలా చేసి ఆ తర్వాత రొటీన్‌లో పడిపోవడమే.

ఫీలింగ్స్‌కి చోటులేదిక్కడ. పని జరగడం కావాలి.

మరో అరగంటలో వాన వచ్చింది.

ఇహలోక బంధాలు తెంచుకున్న సుందరమ్మ గుప్పెడు బూడిదగా మిగిలిపోయింది.

''ఈ మాత్రం జీవితానికి అంత తాపత్రయం ఎందుకని'' సందేశ మిస్తున్నట్టుగా..

★★★

ఆ రోజు పదోరోజు.

ఇల్లంతా జనాలు. వచ్చేవారు, వెళ్ళేవారు, ఎవరికీ టైంకి నిద్ర ఉండట్లేదు. భార్య జారీ చేసే ఆజ్ఞల్ని శిరసా వహిస్తూ మధ్య మధ్యలో పడక్కుర్చీలో విశ్రాంతి తీసుకుంటున్నాడు ప్రదీప్.

పిల్లలంతా టీవీలో కార్టూన్ షో చూస్తున్నారు.

కూతుళ్ళు మైథిలీ, కరుణ చిన్న బెడ్‌రూంలో కూర్చొని తమకి రావాల్సిన వాటాలు ఎలా రాబట్టుకోవాలా అని చర్చిస్తున్నారు.

వంట మనిషికి కావాల్సినవి అందిస్తూ అటు ఇటూ తిరుగుతూ హడావిడి చేస్తోంది సుజాత. తను చాలా కష్టపడుతోందని అందరూ అనుకోవాలని కాబోలు. మధ్య మధ్యలో తలుపు చాటుగా నిలబడి ఆడపడుచుల మాటలు వింటూ వాళ్ళు రేపే దుమారాన్ని ఎదుర్కోడానికి మానసికంగా సిద్ధపడుతోంది.

ఎవరి ఆలోచనల్లో వారున్నారు కానీ ఎవరూ ఇంకా పైకి అనట్లేదు. తగిన సమయం కోసం ఎదురు చూస్తున్నారు.

★★★

భోజనాలయ్యాక అందరూ హాల్లో కూర్చున్నారు.

''ఏరా అమ్మ బంగారం ఏం చేశావు?'' ప్రదీప్‌ని ఉద్దేశిస్తూ అడిగింది మైథిలి.

భార్యవంక చూశాడు ప్రదీప్.

భర్త చదివిన చదువులో సగం కూడా చదువు లేదు సుజాత. అతడికున్న విజ్ఞానంలో ఆవగింజంత కూడా లేదామెకు. కానీ ఆమె అతడిని శాసిస్తుంది. అదే విచిత్రం!

భర్తకి అభయమిస్తున్నట్టుగా చూసి సుజాత అందుకుంది.

''మీ అమ్మగారు ఆర్నెల్లుగా మంచాన ఉంటే ఒక్కసారైనా వచ్చి చూశారా మీరు? కన్నతల్లి బాగోగులు అఖ్ఖర్లేదు కానీ, ఆవిడ బంగారం కావాల్సొచ్చిందా'' వెటకారంగా అంది సుజాత.

''మేం రాకపోడానికి సవాలక్ష కారణాలుంటాయి. అంత మాత్రాన తల్లిమీద ప్రేమ లేదనా?'' రోషంగా అంది కరుణ.

''సరే, రాకపోడానికి మీకు యిబ్బందులుంటాయేమో ఎవడు చూడొచ్చాడు గానీ, ఇన్నాళ్ళూ ఆ ముసలావిడ ఆలనా పాలనా చూసినందుకు ఆ బంగారమంతా నాకే రావాలి, ఇక మాటలనవసరం'' ఖచ్చితంగా అంది సుజాత.

''తల్లి బంగారం ఆడపిల్లలకే ఇవ్వాలి. నువ్వెవరు మధ్యలో లాక్కోడానికి. నీకు తెలీకపోతే ఎవరినైనా అడిగి తెలుసుకో, నీ అతి తెలివి తేటలు నా దగ్గిర కాదు'' కోపంగా అంది మైథిలి.

''బంగారమే కాదు ఇల్లుకూడా మాకు వాటా ఇయ్యాల్సిందే'' అంది కరుణ.


భర్త వంక చురచురా చూసింది సుజాత.

ఆ చూపుల కర్థం తెలిసిన ప్రదీప్ గతుక్కుమన్నాడు.

''మీ అమ్మగారి ఆరోగ్యం బాగులేదు. ఇప్పుడే ఆవిడ పేరనున్న ఇల్లు మీ పేరుమీద రాయించుకోండి. లేకపోతే ఆనక మీ అక్కలతో గొడవలొస్తాయి'' అన్న సుజాత ముందుచూపు సహాని పాటించనందుకు తనని తనే తిట్టుకున్నాడు ప్రదీప్.

వచ్చిన బంధువులంతా చోద్యం చూస్తున్నారే కానీ, ఒక్కరూ నోరు మెదపట్లేదు.

రానురాను వారిమధ్య వాగ్వివాదం తారాస్థాయికి చేరుకొని అది దెబ్బలాటలోకి దిగింది.




''అమ్మగారూ...ఓసారి మీ గొడవ ఆపండమ్మా'' అన్న మంగమ్మ అరుపునకు అందరూ ఒక్కసారి మంగమ్మ వైపు చూశారు ఏమిటన్నట్టు.

''అమ్మగారూ! మీరంతా పెద్దమ్మగారి నగలకోసం, ఆయమ్మ పట్టుచీరలు పంచుకోడం కోసం తగూలాడు కుంటున్నారు. మరి ఇదెవరు పంచుకుంటారమ్మా మీలో'' సుందరమ్మ పడుకునే పాత మంచాన్ని చూపిస్తూ అంది మంగమ్మ.

''ఛీ...చాపమీదే ఆవిడ పోయింది. ఆ పాత మంచం కూడా ఇన్నాళ్ళూ ఆవిడ వాడుకున్నదే. అవేవీ ఇంట్లో ఉంచుకోకూడదు గానీ నీవు పట్టుకుపో'' అంది సుజాత.

''ఆ నగలూ, చీరలూ కూడా ఆవిడ వాడుకున్నవేగా అమ్మా''

''ఏంటే వాగుతున్నావ్ నీ హద్దుల్లో నువ్వుండు''

''హద్దు దాటి మాట్లాడితే నన్ను క్షమించండమ్మా...ఆ చల్లని తల్లి కష్టాల్లో ఉన్న నన్ను చేరదీసి పట్టెడన్నం పెట్టిందమ్మా. ఆ యిష్టంతోటే మీరెన్ని మాటలన్నా ఆ అమ్మగార్ని విడిచిపెట్టకుండా చివరిదాకా ఆయమ్మ సేవ చేసుకున్నానమ్మా...ఆ తల్లిని కడదాకా మోసిన ఈ పాత మంచం నేనే తీసుకెడతాలేగానీ, వెళ్ళేముందు ఒక మాట చెబుతా మీకు చెప్పేటంత గొప్పదాన్ని కాకపోయినా.

ఛూడండమ్మా మనుషులు బతకడానికి డబ్బు కావాలి కానీ, డబ్బుకోసమే మనుషులు బతక్కూడదు తల్లీ. జబ్బు చేస్తే తగ్గడానికి మందులేసుకుంటాం, అలాగని మందులొక్కటే తిని బతకలేంగా. డబ్బంటే అవసరాలనే జబ్బులకి మందులా పని చెయ్యాలి కానీ, డబ్బొక్కటే మనకి ముఖ్యమనుకుంటే ఈ ప్రపంచంలో ఇక ఏ బంధాలూ మిగలవు తల్లీ.

ఈరోజు తల్లి పోయాక ఆవిడ ఆస్తికోసం తోబుట్టువులమనే ఇంగితం కూడా లేకుండా రోడ్డున పడి దెబ్బలాడుకుంటుంటే, రేపు మీరంతా బతికుండగానే మీ పిల్లలు మీ ముందరే మీ ఆస్తికోసం కొట్టుకుంటారు. మీ పిల్లలు అలా మారకుండా ఉండాలంటే ముందు మీరు బాగుపడండమ్మా...

తన ముగ్గురు పిల్లలూ మూడు రత్నాలని మురిసి పోయిన మీ తల్లి ఆ రత్నాలు, కాదు, కేవలం మెరుస్తున్న రంగురాళ్ళేనని తెలుసుకోలేకపోయింది. మీలో ఇంకా ఏమైనా మానవత్వముంటే మనుషుల కోసం బతకడం నేర్చుకోండమ్మా..వస్తా'' అని వెళ్ళిపోతున్న మంగమ్మ వంక చూస్తూ వాళ్ళంతా ఆలోచనలో పడ్డారు. ★